క్లుప్తంగా

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు



చినగదిలిలో షిర్డీ సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: చినగదిలిలో నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం సందర్భంగా రెండో రోజు ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటలు వరకు నిరాటంకంగా భజనలు చేశారు. ఏకాహం, ఓం సాయి, శ్రీసాయి, జైజై సాయి అనే మాల మంత్ర ఉచ్చారణ చేస్తూ 12 గంటల పాటు భజన సాగించారు. చినగదిలి, పెదగదిలి, దీన్‌దయాళ్‌పురం, సూర్యతేజానగర్, ఆరిలోవ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఈ ఉత్సవాలు సోమవారం ముగియనున్నాయి. ముగింపు సందర్భంగా సాయిబాబాకు అన్నాభిషేకం చేయనున్నారు. మధ్యాహ్నం భక్తులు మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ప్రమాద బాధితులకు పరామర్శ



రోగుల బంధువులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్

మహారాణిపేట: విశాఖ స్టీల్‌ప్లాంటులో ఎస్ఎంఎస్-2లో జరిగిన అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉద్యోగులను ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్ ఆదివారం పరామర్శించారు. మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు సెవెన్‌హిల్స్ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడారు. ఇటువంటి ప్రమాదాలు జరగకుండా స్టీల్‌ప్లాంటు యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. అత్యవసర చికిత్స కోసం అవసరమైతే క్షతగాత్రులను ప్రత్యేక విమానంలో ముంబయి తరలించాలని ఆయన కోరారు. అనంతరం రోగుల బంధువులతో మాట్లాడి, ధైర్యం చెప్పారు.

మత్తుకు బానిసలు కావొద్దు



ర్యాలీ నిర్వహిస్తున్న హిమ హ్యూమానిటేరియన్ అసోసియేషన్ సభ్యులు

బీచ్ రోడ్డు: మత్తుకు బానిసలై జీవితాన్ని పాడు చేసుకోవద్దంటూ సాగర తీరంలో హిమ హ్యూమానిటేరియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ ర్యాలీని డాక్టర్ ఆర్.అచ్యుంనాయుడు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత మత్తుకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి శాస్త్రీ, ప్రొఫెసర్ రామకృష్ణా, అసోసియేషన్ ప్రతినిధులు దాస్ పాల్గొన్నారు.

గంజాయి కేసులో మరో నలుగురి అరెస్ట్

బీచ్ రోడ్డు: బీచ్ రోడ్డులో అక్రమంగా గంజాయి విక్రయాలు చేపట్టిన వారికి గంజాయి సప్లయ్ చేస్తున్న నలుగురిని మూడో పట్టణ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి బీచ్‌రోడ్డులో అక్రమంగా గంజాయి విక్రయాలు చేస్తున్న ముగ్గురు ఏయూ సెక్యూరిటీ గార్డులను పోలీసులు అరెస్ట్ చేసి విచారించారు. తమకు ఆనందపురానికి చెందిన సాయి, గోవింద్, తూర్పు గోదావరికి చెందిన సంతోష్, శ్రీకాకుళానికి చెందిన సతీష్ గంజాయిని సప్లయ్ చేసినట్లు సెక్యూరిటీ గార్డులు తెలిపారు. దీంతో రంగంలోకి దిగిన మూడో పట్టణ పోలీసులు ఆ నలుగురిని కూడా అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.

హాస్టల్ భవనం.. చదువుల నిలయం



హాస్టల్ భవనంపై చదువుకుంటున్న విద్యార్థినులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం హాస్టల్ భవనాలపై విద్యార్థులు చదువుకోవడానికి వీలుగా అధికారులు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారు. ఇటీవల కాలంలో కొత్తగా నిర్మించిన ప్రతి హాస్టల్ భవనంపైన ప్రత్యేకంగా సిమెంట్ బెంచీలు, టేబుళ్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళల్లో విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో హాయిగా చదువుకోవడానికి ఇవి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయి. పై అంతస్తులో ప్రత్యేకంగా టాయిలెట్స్ కూడా నిర్మించి అందుబాటులో తీసుకొచ్చారు. గ్రంథాలయానికి ప్రత్యామ్నాయంగా ఈ సౌకర్యాలు నిలుస్తున్నాయి.

హాస్టళ్లలో ఉండే విద్యార్థులు టెర్రస్‌పై సాయంత్రం వేళల్లో చదువుకుంటూ తమ సమయాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నారు. వర్సిటీలో నిర్మించే ప్రతి హాస్టల్‌లో ఇటువంటి సదుపాయాలు కల్పించాలని ఇంజినీరింగ్ అధికారులకు వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ప్రతి హాస్టల్ భవనంపై విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక వసతులు కల్పిస్తుండడంపై అందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మహనీయులు నడిచిన నేల విశాఖ నగరం

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ
- ముగిసిన సౌందర్యలహరి ప్రవచన మహోత్సవాలు



ప్రవచిస్తున్న షణ్ముఖశర్మ



పాల్గొన్న మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, తదితరులు

ఎంవీపీ కాలనీ: నేటి ఆధునిక ప్రపంచానికి ఆధ్యాత్మిక చైతన్యం కల్పించిన మహనీయుల నడిచిన నేల విశాఖపట్నమని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. వారం రోజులుగా ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని భద్రం పార్కులో నిర్వహిస్తున్న శ్రీశక్తి పంచాయతన యోగ పూర్వక శ్రీసౌందర్యలహరి ప్రవచన మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా షణ్ముఖ శర్మ మాట్లాడుతూ ఆధ్యాత్మిక చైతన్యాన్ని విశాఖ నుంచి సద్గురు శివానందమూర్తి, ఎక్కిరాల కృష్ణమాచార్య, శ్రీభాష్యం అప్పలచార్యులు వంటి మహనీయులు విశ్వవ్యాప్తం చేశారన్నారు. సుబ్రహ్మణ్యస్వామి పేరున వెలసిన మహా నగరంగా విశాఖపట్నం వర్ధిల్లుతోందని, దీనికి ఎంతో భవిష్యత్ ఉందని వెల్లడించారు. ప్రవచనాలు ముగిసిన అనంతరం షణ్ముఖశర్మను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎక్కిరాల అనంతకృష్ణ, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య కృష్ణమోహన్, కేవీఎస్ శ్యామ్, అరుణ దంపతులు, శ్రీహరి సేవా బృందం కో-ఆర్డినేటర్ సీహెచ్.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు. జీవీ సురేష్, పి.కామేశ్వరి బృందం ఆలపించిన భక్తీ సంగీతం అందరిని అలరించింది.

విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న క్లబ్ అధ్యక్షుడు ఇసుకపల్లి వెంకటేశ్వరరావు

ఏయూ క్యాంపస్: నగరానికి చెందిన బ్లూస్టార్స్ స్పోర్ట్స్, కల్చరల్ క్లబ్ 12వ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం ఏయూ ప్లాటినం జూబ్లీ సమావేశ మందిరంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఏయూ క్రీడా విభాగ సంచాలకుడు ఆచార్య ఎస్.విజయ్‌మోహన్ మాట్లాడుతూ క్రీడల్లో యువతను భాగస్వాములను చేస్తూ బ్లూస్టార్స్ ఫుట్‌బాల్ క్లబ్ దశాబ్ద కాలంగా వందలాది మంది క్రీడాకారులను తీర్చిదిద్దిందని కొనియాడారు. క్లబ్ నిర్వాహకుడు, కోచ్ నరేష్ మాట్లాడుతూ గత 12 ఏళ్లుగా 700 మంది వరకు యువతను ఫుట్‌బాల్ క్రీడాకారులుగా తీర్చిదిద్దామన్నారు. వీరిలో పది మంది వరకు జాతీయ స్థాయిలో రాణించారన్నారు. భవిష్యత్తులో మరింత మందిని అత్యుత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ విద్యతో సమానంగా యువత క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. క్లబ్ గౌరవ అధ్యక్షుడు ఇసుకపల్లి వెంకటేశ్వరరావు సంస్థ కార్యక్రమాలను తెలియజేశారు. ఈ సందర్భంగా క్లబ్ వివిధ పోటీలలో సాధించిన ట్రోఫీలు, పతకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి సహకారం అవసరం



జ్యోతి వెలిగిస్తున్న అఖిల భారత సీమా సురక్ష సహ ప్రముఖ్ జి.మురళీధర్, మత్స్యకార నాయకులు

ఆరిలోవ: మత్స్యకారుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించాలని అఖిల భారత సీమా సురక్ష సహ ప్రముఖ్ జి.మురళీధర్ కోరారు. జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లోని బీవీకే పాఠశాల ఆవరణలో ఆదివారం మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమితి విధి విధానాలపై చర్చించారు. మత్స్యకారుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టాలి, ప్రభుత్వాల నుంచి ఎలాంటి సహకారం కోరాలి.. తదితర అంశాల గురించి మాట్లాడారు. అనంతరం మురళీధర్ మాట్లాడుతూ ప్రకృతి సంపదైన తీర ప్రాంతాలను అందరూ కలసికట్టుగా కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల నాయకులకు పూర్తిస్థాయిలో మత్స్యకారుల విధి విధానాలు, సమస్యలపై అవగాహన ఉండాలన్నారు. విద్యా భారతి అఖిల భారత అధ్యక్షుడు దూసి రామకృష్ణ, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు, రాష్ట్ర మత్స్యకార సంఘం అధ్యక్షుడు కె.పోలయ్య మాట్లాడుతూ రాష్ట్ర మత్స్యకార సంక్షేమం కోసం 2004లో ఈ సమితి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అప్పటి నుంచి మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.10 వేలు భృతిని రూ.25 వేలకు పెంచాలని, వేట సమయంలో మృతి చెందిన వారికి రూ.25 లక్షలు బీమా పరిహారం చెల్లించాలన్నారు. ఇంటిగ్రేటెడ్ ఫిషరీస్ డెవెలప్‌మెంట్ అథారిటీ(ఐఎఫ్‌డీఏ) ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరిమళ్ల వాసు, ఎంపాడ రాష్ట్ర కోఆర్డినేటర్ హనుమంతరావు, అన్ని జిల్లాల సంఘాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో నీలకంఠ దివస్



ఆదర్శనగర్‌లో పేదలకు ఆహార పొట్లాలు అందిస్తున్న ఆనంద్‌మార్గ్ ఆశ్రమం విద్యార్థి

ఆరిలోవ: ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో ఆదివారం నీలకంఠ దివస్ ఘనంగా జరిగింది. ఆశ్రమంలో ఆనంద్ మార్గ్ వ్యవస్థాపకుడు ప్రభాత్ బాబా చిత్ర పటానికి ఇక్కడి పిల్లలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భజనలు చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని విద్యార్థులు ఆదర్శనగర్, డెయిరీ ఫారంతో పాటు నగరంలో బస్ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ సమీపంలో పేదలకు ఆహార పొట్లాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆశ్రమం స్వామీజీలు జ్యోతి ప్రకాష్ అవదూత, సామ్యానంద్ అవదూత మాట్లాడుతూ 1973లో ప్రభాత్ బాబాపై విష ప్రయోగం జరిగిందన్నారు. దీనికి నిరసనగా బాబా ఐదు సంవత్సరాలు నాలుగు నెలల పాటు ఉపవాసంలో గడిపారన్నారు. ఉపవాస సమయంలో మజ్జిగ మాత్రమే తీసుకునే వారన్నారు. ఆయనపై విషయ ప్రయోగం జరిగిన ఫిబ్రవరి 12వ తేదీని నీలకంఠ దివస్‌గా జరుపుతున్నట్టు తెలిపారు.

బహిరంగ మూత్ర విసర్జన తగదు



అవగాహన ర్యాలీలో పాల్గొన్న జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసినాయుడు

బీచ్ రోడ్డు: సాగరతీరంలో బహిరంగ మూత్ర విసర్జన తగదని జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసినాయుడు అన్నారు. ఆదివారం జీవీఎంసీ అధికారులు బహిరంగ మూత్ర విసర్జన వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్కే బీచ్ నుంచి వైఎంసీఏ వరకు తీరంలో నడక కార్యక్రమం చేపట్టారు. సందర్శకులు, చిరు వ్యాపారులకు తీరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సన్యాసినాయుడు సూచించారు. జోన్ 2, 3 సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనృసింహ హోమం



నృసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు



ప్రధాన కలశంతో ప్రదక్షిణ చేస్తున్న ప్రధానార్చకుడు రమణాచార్యులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రమైన ప్రతీ స్వాతి నక్షత్రం రోజున సింహగిరిపై నృసింహ హోమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఆదివారం స్వాతి నక్షత్రం కావడంతో ఉదయం 7 నుంచి ఆలయ కల్యాణ మండపంలో హోమం నిర్వహించారు. తొలుత చక్రపెరుమాళ్లను వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య ఆలయంలోంచి ఊరేగింపుగా కల్యాణ మండపానికి తీసుకొచ్చి అక్కడి హోమగుండం వద్ద అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కలశారాధన, అగ్నికార్యం చేశారు. అనంతరం హోమం విశేషంగా నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, కుంభప్రోక్షణ భక్తిశ్రద్ధలతో చేశారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని ప్రధానర్చకుడు ఇరగవరపు రమణాచార్యులు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి తీసుకెళ్లి స్వామి వారి మూలవిరాట్‌కు సమర్పించారు. తదుపరి ఆ జలాలను భక్తులపై చల్లారు. ఆలయ అర్చకులు శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈవో నరసింహరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

త్యాగరాజ స్వామికి పంచరత్న సేవ



పంచరత్న సేవలో పాల్గొన్న విద్యార్థినులు

సీతంపేట: త్యాగరాజ స్వామి ఉత్సవాల్లో భాగంగా కార్తికేయ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఆదివారం బీవీకే కళాశాలలో పంచరత్న సేవ జరిగింది. ముఖ్య అతిథి ప్రముఖ గాత్ర విద్వాంసుడు మల్లాది శ్రీరామ్‌ప్రసాద్ వాగ్గేయకారుల గొప్పతనాన్ని వివరించారు. అనంతరం జగదానందకారక, దుడుకుగల, సాధించెనే, కనకనరుచిరా, ఎందరో మహానుభావులు పంచరత్న కృతులను సంగీత విద్వాంసులు, విద్యార్థులు కలిపి గానం చేశారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు త్యాగరాజ కృతులను ఆలపించారు. ఈ కార్యక్రమంలో విద్వాంసులు డాక్టర్ బి.కె.డి.ప్రసాద్, బండి శ్యామల, కాశీ ప్రసాద్, శంకరం పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో

ఆనందపురం: ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాలలో ఆరుగురు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. మారికవలసకు చెందిన పలువురు అనకాపల్లి జిల్లా దేవరాపల్లి గ్రామంలో జరిగిన వివాహానికి హాజరయ్యారు. తిరిగి ఆదివారం ఉదయం ఆటోలో బయలుదేరి మారికవలస వస్తున్నారు. ఆ ఆటో పెందుర్తి-ఆనందపురం జాతీయ రహదారిపై శొంఠ్యాం పంచాయతీ గొంతినవానిపాలెం వద్ద గల సర్వీసు రోడ్డు వద్దకు చేరుకునే సరికి అదుపుతప్పి డివైడర్ గ్రిల్స్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న హారిక(14), వెంకటలక్ష్మి(27), లావణ్య(20), కుమారి(27) గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆటో

మండలంలోని శొంఠ్యాం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. గోపాలపట్నానికి ఆల్తి సన్యాసిరావు(29), లావణ్య(28)లు ద్విచక్ర వాహనంపై బయలుదేరి పద్మనాభం మండలం పాండ్రంకి వెళ్తున్నారు. వారు శొంఠ్యాం వద్దకు చేరుకునే సరికి వెనుక నుంచి వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ సంఘటనలో సన్యాసిరావు, లావణ్యలు గాయపడగా చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. కేసులను స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విశాఖ ఉక్కు ఉద్యమంపై డాక్యుమెంటరీ



మాట్లాడుతున్న కేకే రావు

కూర్మన్నపాలెం : ఉక్కు రిలే నిరాహారా దీక్షలు ప్రారంభమై రెండేళ్లు పూరైన సందర్భంగా విశాఖ ఉక్కు ప్రాముఖ్యతను, ఉద్యమ నేపథ్యాన్ని వివరిస్తూ విశాఖ ఉక్కు పేరుతో నిర్మించిన డాక్యుమెంటరీని వైజాగ్ యూట్యూబ్ చానల్‌లో కె.కె.రావు ఎక్స్ డైరెక్టర్ ఆపరేషన్స్ స్టీల్‌ప్లాంట్ దీక్షా శిబిరం వద్ద ఆదివారం విడుదల చేశారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న 731వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో డాక్యుమెంటరీ ఫిల్మ్ విడుదలను పురస్కరించుకుని ఉక్కు ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ప్రతినిధులు బోండా తవుడన్న, బాయ్యా మల్లయ్య, ఎల్‌వీ రమణ, ఎస్.సత్యనారాయణ, మాటూరి శ్రీనివాసరావు, ముప్పిడి రాజు, సత్యనారాయణ, బి.ఎస్.రెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కె.కె.రావు మాట్లాడుతూ కార్మికులను, ఉద్యమ స్ఫూర్తిని, రెండేళ్లలో కార్మికులు చేస్తున్న పోరాట ప్రతిమను కొనియాడారు. అనంతరం పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, కె.ఎస్.ఎన్.రావు, పరంధామయ్య, రమణారెడ్డి మాట్లాడుతూ త్యాగాలు, పోరాటాలు ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేస్తే సహించేదిలేదన్నారు. బీజేపీ మినహా అన్ని రాజకీయపార్టీలు స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘీభావం తెలిపాయన్నారు. త్వరలోనే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకలు , ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో సురక్షిత ప్రయాణం



ట్రాఫిక్ పోలీసులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సత్యసాయి మహిళా యువజన విభాగం సభ్యులు

సీతంపేట: సురక్షిత ప్రయాణానికి హెల్మెట్ ధరించాలంటూ శ్రీసత్యసాయి మహిళా యువజన విభాగం సభ్యులు అవగాహన కల్పించారు. ఆదివారం అక్కయ్యపాలెం హైవే కూడలిలో ట్రాఫిక్ భద్రతపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఫోర్త్‌టౌన్ ట్రాఫిక్ సీఐ షణ్ముకరావు ఆధ్వర్యంలో పోలీసులతో కలిసి ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ ధారణ ఆవశ్యకతను తెలియజేశారు. హైవే సిగ్నల్ పాయింట్ వద్ద హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారి వద్దకు వెళ్లి ప్లకార్డులు పట్టుకుని హెల్మెట్ ధరించడం వల్ల కలిగే మేలును వివరించారు. ప్రమాదాలు జరిగినపుడు ప్రాణాపాయం నుంచి హెల్మెట్ రక్షిస్తుందన్నారు. ఫోర్త్‌టౌన్ ట్రాఫిక్ ఎస్ఐలు గంగాధర్, వి.వాణిశ్రీ, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, సత్యసాయి సేవా సమితి మహిళా యూత్ కో ఆర్డినేటర్లు మల్లిక, సంగీత, నందిని, మహిళా యూత్ సభ్యులు, సమన్వయకర్త సత్యారావు పాల్గొన్నారు.

మత సామరస్యంతో శాంతి స్థాపన



శాంతి ప్రతిజ్ఞ చేస్తున్న సంస్థ సభ్యులు

సీతంపేట: ప్రపంచ శాంతిని కోరుతూ బి.వి.ఫౌండేషన్, ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడం సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ సర్వమతాలు ఐక్యంగా ఉంటే శాంతి స్థాపన సాధ్యపడుతుందన్నారు. దేశభక్తి, కులం, మతం అనేవి పూర్తిగా వ్యక్తిగత విషయాలని, వివిధ మతాలకు చెందిన వారు కలిసి జీవించడం మన భరతజాతి సంస్కృతిగా పేర్కొన్నారు. ఆ విధంగా మన దేశం ఇతర దేశాలకు మార్గదర్శకమన్నారు. ఈ దశలో ఐఏఆర్ఎఫ్ కార్యక్రమాలు చురుగ్గా నిర్వహించడం అభినందనీయమన్నారు. శాంతి సంఘం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరాలని సమావేశంలో నిర్ణయించారు. ఇంటర్నేషనల్ కౌన్సిల్ సభ్యుడు నరవ ప్రకాశరావు మాట్లాడుతూ సంస్థ ఆశయాలను తెలుపుతూ మానవ హక్కుల పరిరక్షణకు సహకారం, మతపరమైన సంస్థలతో కలిసి సర్వమత సమైక్యతకు సమాజ సేవకు విస్తృతంగా కృషి చేస్తోందన్నారు. ముందుగా సర్వమత ప్రార్థనలు చేసి శాంతి కోసం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ ఎం.ఎస్.ఆలీ బైగ్, హరగోపాల్, డానియల్ రాజు, రాజేంద్రజైన్, బి.చిన్నారావు, ఎస్.కె.సాహు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ శ్రీనివాసరావు



రౌడీ షీటర్లకు సూచనలిస్తున్న ద్వారకా సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: స్థానిక ఫోర్త్‌టౌన్, ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్లలో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐలు శ్రీనివాసరావు, సింహాద్రినాయుడు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ రౌడీ షీటర్ల దినచర్య, సత్ప్రవర్తన, వారిపై ఉన్న కేసుల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. సమాజంలో అల్లర్లు చేయకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. ఎటువంటి నేరాల జోలికి వెళ్లినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీ షీటర్లపై పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని, మంచిగా నడుచుకోవాలని సూచించారు. కౌన్సెలింగ్ అనంతరం రౌడీ షీటర్లను పోలీస్ సిబ్బంది వాహనాలపై ఇళ్లకు అప్పగించి వచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ ధర్మేంద్ర, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఓసీల సమస్యలపై సదస్సులు



సింహగిరిపై కరుణాకర్‌రెడ్డి దంపతులు

సింహాచలం: అగ్రవర్ణ పేదలకు అమలవుతున్న 10 శాతం విద్య, ఉద్యోగ రిజర్వేషన్లపై ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో చర్చించి ఏకాభిప్రాయం సాధించాలని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకరరెడ్డి డిమాండ్ చేశారు. వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం ఆయన సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని స్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు సమర్థించిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కొన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఓర్వలేనితనంతో వ్యతిరేకించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. నిరుపేద ఓసీల సమస్యలపై దేశవ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

పరవాడ: పరవాడ-గాజువాక రహదారిలో స్థానిక బాలికల వసతి గృహం వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో కె.రాంబాబు(35) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. స్థానిక జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నివాసం ఉంటున్న రాంబాబు ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై పరవాడ నుంచి కాలనీకి వెళుతున్న క్రమంలో వాహనం అదుపు తప్పడంతో వసతి గృహం సమీపంలోని విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో రాంబాబు తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని యువకులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు.